https://teluguislam.net



# అధ్యాయం–3

## 83–108

## 3–ఇస్లామీయ విధులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

- అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే విధులు.
- అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం వేళకు నమాజు చేయడం
- తల్లిదండ్రుల సేవలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అల్లాహ్ మార్గంలో (షహీద్) అమరులైన వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు .
- ఉపవాసాలు పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- జకాత్ విధిగా చెల్లించేవారిపై అల్లాహ్ కారుణ్యం ఉంటుంది.
- హజ్జ్ చేసినవారి సర్వ పాపాలు క్షమించబడతాయి.

https://teluguislam.net



# 3–ఇస్లామీయ విధులను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

## అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే విధులు:

ఇస్లాం ధర్మాన్ని సక్రమంగా విశ్వసించిన తరువాత ఇస్లామీయ విధులను ఆచరించటం అల్లాహ్ ప్రేమ పొందుటకు మూల కారణం. అంటే నమాజ్, జకాత్, ఉపవాసం, హజ్జ్ వంటి విధులు పాటించడం.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ– వారంతా ఒండొకరికి (సహాయకులుగా, చేదోడువాదోడుగా) మిత్రులుగా ఉంటారు. వారు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు. చెడుల నుండి వారిస్తారు. నమాజులను నెలకోల్పుతారు. జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. అల్లాహ్ అతి త్వరలో తన కారుణ్యాన్ని కురిపించేది వీరిపైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేచనశాలి. – విశ్వసించిన ఇలాంటి స్త్రీ పురుషులకు, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గ వనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలో పరిశుభ్రమైన మేడలు వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికీ మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. గొప్ప సాఫల్యం అంటే ఇదే.’’[1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు, అల్లాహ్ అన్నాడు:.... ‘నేను నా దాసుడిపై విధిగా (ఫర్జ్)

---

[1] (సూరతు తౌబా: 71–72)

https://teluguislam.net



చేసిన విషయాలను ఆచరించి అతను నాకు దగ్గరయితే అంతకన్నా నాకు ప్రీతి కరమైన విషయం మరొకటి లేదు....'' [1]

హజ్రత్ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజియల్లాహు అన్హు) కథనం: ఒక రోజు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికి నజ్ద్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి వచ్చాడు. అతని తల వెంట్రుకలు చిందరవొందరగా ఉన్నాయి. ముందుగా మాకు అతని మాటలు అర్థం కాలేదు. అతని మాటల తాలుకు శబ్దం మాత్రం మాకు వినపడసాగింది. దగ్గరకు వచ్చిన తర్వాత అర్థమయింది.

అతను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇస్లాం ధర్మం గురించి అడుగుతున్నాడని. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని ప్రశ్నకు సమాధానమిస్తూ:

'(ఇస్లాం ప్రకారం) రేయిం బవళ్లలో ఐదు నమాజులు చేయాలి' అని అన్నారు.

అతను: 'అవిగాక ఇతర నమాజులేమయినా నేను చేయవలసి ఉంటుందా?' అని అడిగాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): '(విధిగా చేయనవసరం) లేదు. ఒక వేళ నీవు స్వచ్ఛందంగా చేయదలచుకుంటే చేసుకోవచ్చు. పోతే రమజాన్ మాసంలో విధిగా ఉపవాసం పాటించవలసి ఉంటుంది' అని అన్నారు.

అతను: రమజాన్ ఉపవాసాలు గాక ఇతర ఉపవాసాలేవయినా నేను పాటించవలసి ఉంటుందా?' అని అడిగాడు.

---

[1] (బుఖారీ:6021).

https://teluguislam.net



దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'పాటించవలసిన అవసరం లేదు. ఒక వేళ నీవు స్వచ్ఛందంగా పాటించాలంటే అది నీ యిష్టం' అని చెప్పారు.

అదే విధంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'జకాత్' గురించి కూడా వివరించారు.

అప్పుడు కూడా అతను: 'అదనంగా మరేమయినా చెల్లించవలసి ఉంటుందా?' అని అడిగాడు.

ఆయన(స) దానికి సమాధానమిస్తూ: 'అవసరం లేదు.' ఒక వేళ నీవు స్వచ్ఛందంగా ఏదయినా దానం చేస్తే అది వేరే విషయం. అని సెలవిచ్చారు.

ఆ తర్వాత ఆ వ్యక్తి: 'అల్లాహ్ సాక్షిగా! ఇక నేను ఇందులో ఏ విషయాన్నీ చేర్చను. ఇందులో దేన్ని తగ్గించను కూడా' అనుకుంటూ తిరిగి వెళ్ళిపోసాగాడు.

అతని మాటలు విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఇతను గనక నిజంగా తన మాటల్ని ఆచరణలో పెడితే తప్పకుండా సాఫల్యం పొందుతాడు' అని అన్నారు. [1]

కొంత మంది నమాజ్ మరియు హజ్ వంటి విధులను పాటించకుండా ప్రజా సేవలో సమయాన్ని గడిపితే మరియు హజ్జ్ కొరకు ఖర్చు చేసే డబ్బుకు బదులు ఆ డబ్బుతో బీదవారిని ఆదుకుంటే దేవుని ప్రేమ పొందగలం అని నమ్ముతారు. అలా వారి నమ్మకం సరికాదని పైన ఇవ్వబడిన ఆయతుల ద్వారా మరియు హదీసుల ద్వారా స్పష్టమవుతున్నది.

[1] (బుఖారీ:44, ముస్లిం:12).

https://teluguislam.net



కనుక ఒక హదీసులో ఇలా ఉంది; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: అల్లాహ్ తన దాసులలో ఎవరినయినా ప్రియతమునిగా చేసుకున్నప్పుడు, జిబ్రయీల్ (అలైహిస్సలామ్)ను పిలిచి: **'నిశ్చయంగా నేను ఫలాన దాసుణ్ణి ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా అతన్ని ప్రేమించు'** అని అంటాడు.

మరియు అతని గురించి ఆకాశంలో ప్రకటన గావిస్తాడు. ఆ తరువాత భూ మండలంలో కూడా ఆ వ్యక్తి పట్ల (అందరికి) ప్రియతమునిగా రాణిస్తాడు.

ఆ విషయమే కదా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నిశ్చయంగా విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారి యెడల కరుణామయుడైన అల్లాహ్ ప్రేమానురాగాలను సృజిస్తాడు.’’ [1]

మరియు అల్లాహ్ తన దాసులలో ఎవరినయినా ఆగ్రహించినప్పుడు జిబ్రయీల్ (అలైహిస్సలామ్)ను పిలిచి: ‘‘నిశ్చయంగా నేను ఫలాన దాసుణ్ణి ఆగ్రహిస్తున్నాను. నీవు కూడా అతన్ని ఆగ్రహించు’’ అని అంటాడు. మరియు ఆయన గురించి ఆకాశంలో ప్రకటన గావిస్తాడు. ఆ తరువాత భూ మండలంలో ఉన్నవారు కూడా ఆ వ్యక్తిని ఆగ్రహించు కున్నట్టుగా చేస్తాడు' [2]

## అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం వేళకు నమాజు చేయడం:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (ముస్లిములారా!) వాస్తవానికి మీ స్నేహితులు అల్లాహ్, ఆయన ప్రవక్త, ఇంకా నమాజును నెలకొల్పే, జకాతును చెల్లించే, రుకూ చేసే విశ్వాసులు మాత్రమే. – అల్లాహ్‌ను

---

[1] (సూరతు మర్యమ్:96).

[2] (తిర్మిజీ: 3161, సహీహ్ అల్‌జామే: 284).

https://teluguislam.net



ఆయన ప్రవక్తను, విశ్వాసులను మిత్రులుగా చేసుకున్నవారు, అల్లాహ్ పక్షంవారే విజయం పొందుతారన్న విషయాన్ని తెలుసుకోవాలి.''[1]

హజ్రత్ అబూ అబ్దుర్ రహ్మాన్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజియల్లాహు అన్హు) కథనం: నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని 'అల్లాహ్ వద్ద అతి ప్రీతికరమైన ఆచరణ ఏది?' అని అడిగాను.

**దానికి ఆయన(స):** 'వేళకు నమాజు చేయడం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**దానికి ఆయన(స):**'తల్లి దండ్రుల పట్ల మంచిగా మెలగటం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**అందుకాయన(స):**'అల్లాహ్ మార్గంలో(జిహాద్)పోరాడటం' అని చెప్పారు.[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచిస్తుండగా తాను విన్నాని హజ్రత్ ఉస్మాన్ బిన్అఫ్ఫాన్ (రజియల్లాహుఅన్హు) తెలియజేశారు: ''ఏ ముస్లిం అయినా ఫర్జ్ నమాజ్ వేళ కాగానే చక్కగా వుజూ చేసి, ఎంతో భక్తితో, ఉత్తమ పద్ధతిలో రూకూ చేస్తే, అది అతని వెనుకటి పాపాలకు పరిహారం అవుతుంది. అయితే అతను ఘోరపాపానికి ఒడిగట్టి ఉండకూడదు. ఈ పరంపర నిత్యం కొన సాగుతునే ఉంటుంది.''[3]

మరియు హజ్రత్ అబూ మూసా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: ''రెండు శీతల (ఫజ్ర్, అస్ర్) నమాజులను చేసేవారు స్వర్గానికి వెళ్తారు.''[4]

---

[1] (సూరతుల్ మాయిదా: 55–56).
[2] (బుఖారీ:496, ముస్లిం:122).
[3] (ముస్లిం:335).
[4] (బుఖారీ:540, ముస్లిం:1005).

https://teluguislam.net



మరొక హదీసులో ఇలా ఉంది: "సూర్యోదయానికి ముందు(ఫజర్) నమాజ్, సూర్యాస్తమయానికి ముందు (ఇషా)నమాజ్ చేసినవాడెవడూ నరకానికి వెళ్ళడూ." [1]

హజ్రత్ జుందుబ్ బిన్ సుఫ్యాన్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ఉదయం పూట నమాజ్ చేసే వ్యక్తి అల్లాహ్ రక్షణలో ఉంటాడు. కనుక ఓ మనిషీ! తాను ఇచ్చిన రక్షణ గురించి అల్లాహ్ నిన్ను ప్రశ్నించకుండా జాగ్రత్తపడు!" [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ఉదయం సాయంత్రం మస్జిద్‌కు వెళ్ళేవ్యక్తి కోసం, అల్లాహ్ స్వర్గంలో అతని ఆతిథ్యానికి ఏర్పాట్లు చేస్తాడు. అతను ఉదయం పూట లేక సాయంత్రం పూట ఎప్పుడు వెళ్ళినా అలాగే జరుగుతుంది." [3]

హజ్రత్ ఇబ్ను ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "సామూహికంగా చేసే నమాజ్ ఒంటరిగా చేసే నమాజ్ కంటే ఇరవై ఏడు రెట్లు శ్రేష్ఠమైనది." [4]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదిస్తుండగా తాను విన్నానని హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజియల్లాహు అన్హు) తెలియ

---

[1] (ముస్లిం:1004).

[2] (ముస్లిం:1050, అహ్మద్:18060, రియాజుస్ సాలిహీన్:1049).

[3] (బుఖారీ:622, ముస్లిం:1073).

[4] (బుఖారీ:609, ముస్లిం:1038).

https://teluguislam.net



జేశారు: ''ఎవరయినా 'ఇషానమాజు'ను సామూహికంగా నెరవేరిస్తే వారు అర్ధ రాత్రి వరకు దైవారాధనలో గడిపినట్లే.

మరెవరయితే **'ఫజ్ర్ నమాజు'**ను సామూహికంగా నెరవేరుస్తారో వారు రాత్రంతా నమాజ్ చేసినట్లే.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అజాన్ చెప్పటానికి, తొలి పంక్తిలో చేరటానికి ఎంతటి ఘనత ఉందో ప్రజలకు తెలిస్తే, దానిని పొందటానికి పరస్పరం లాటరీ వేసుకోవటం తప్ప గత్యంతరం లేదని తెలిస్తే, వారు తప్పకుండా లాటరీ వేసుకుంటారు.'' [2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే నలభై రోజుల వరకు మొదటి తక్బీర్‌లో చేరి సామూహికంగా నమాజు పాటిస్తారో! వారికి రెండు విధాల విముక్తి ప్రాప్తమవుతుంది. ఒకటి, వారు నరకాగ్ని నుండి రక్షించబడుతారు, రెండు కాపట్యం నుండి విముక్తి పొందుతారు.'' [3]

## తల్లిదండ్రుల సేవలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాల మేరకు గమనిస్తే మనిషి అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత నమాజును విధిగా ఆచరించటం వలన అల్లాహ్ ప్రేమ పొందుటకు

---

[1] (ముస్లిం:1049).

[2] (బుఖారీ:580, ముస్లిం:661).

[3] (తిర్మిజీ: 241, హదీస్ హసన్).

https://teluguislam.net



ముఖ్యమైన మార్గం. ఆ తరువాత తల్లిదండ్రుల విధేయతను పాటించటం, ఆ తరువాత అల్లాహ్ పేరు ప్రతిష్టకై జిహాద్ చేయడం అని తెలుస్తుంది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు: మీరు ఆయనను తప్ప మరొకరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి. నీ సమక్షంలో వారిలో ఒకరుగాని, ఇద్దరుగానీ వృద్ధాప్యానికి చేరుకొని ఉంటే వారి ముందు (విసుగ్గా) **''ఊహ్''** అని కూడా అనకు. వారిని కసురుకుంటూ మాట్లాడకు. పైగా వారితో మర్యాదగా మాట్లాడు. – అణుకువ దయా భావంతో ఉట్టిపడే విధంగా నీ భుజాలను వారి ముందు అణిచిపెట్టు. **''ఓ ప్రభూ! బాల్యంలో వీరు నన్ను (ప్రేమానురాగాలతో) పోషించినట్లుగానే నీవు వీరిపై దయజూపు''** అని వారికోసం ప్రార్థిస్తూ ఉండు.[1]

హజ్రత్ అబూ అబ్దుర్ రహ్మాన్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజియల్లాహు అన్హు) కథనం: 'నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ''అల్లాహ్ వద్ద అతి ప్రీతికరమైన ఆచరణ ఏది?' అనడగాను.

**దానికి ఆయన(స):** 'వేళకు నమాజు చేయడం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**దానికి ఆయన(స):** 'తల్లి దండ్రుల పట్ల మంచిగా మెలగటం' అని అన్నారు.

'ఆ తరువాత ఏది?' అని నేను అడిగాను.

**అందుకాయన** 'అల్లాహ్ మార్గంలో (జిహాద్) పోరాడటం' అని చెప్పారు...[2]

---

[1] (బనీ ఇస్రాయీల్:23).

[2] (బుఖారీ:496, ముస్లిం:122).

https://teluguislam.net



హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి:

‘‘నేను (ధర్మం కోసం) హిజ్రత్ ప్రస్థానం (హిజ్రత్) చేస్తాననీ, జిహాద్‌లో పాల్గొంటానని మీతో ప్రమాణం చేస్తున్నాను. దాని వలన అల్లాహ్ తరఫు నుండి పుణ్యం లభించాలని కోరుకుంటున్నాను’ అని అన్నాడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో **‘నీ తల్లిదండ్రుల్లో ఒకరైనా బ్రతికి ఉన్నారా?’** అనడిగారు.

దానికావ్యక్తి : **‘అవును,** ఇద్దరూ బ్రతికి ఉన్నారు’ అని సమాధానమిచ్చాడు.

అందుకాయన(స): ‘నిజంగానే అల్లాహ్ నీకు పుణ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నావా?’ అని అడిగారు.

అతను: **‘అవును’** అని అన్నాడు.

**అప్పుడాయన(స): ‘అలాగయితే నువ్వు నీ తల్లిదండ్రుల దగ్గరికి తిరిగి వెళ్ళిపో. వారిద్దరికి బాగా సేవ చెయ్యి’** (అందులోనే నీకు ఆ పుణ్యం లభిస్తుంది) అని చెప్పి పంపించారు. [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

‘‘తండ్రి సంతుష్టంలోనే అల్లాహ్ సంతుష్టం ఉంది. మరియు తండ్రి అసంతుష్టంలోనే అల్లాహ్ అసంతుష్టం ఉంది.’’ [2]

---

[1] (ముస్లిం:4624).

[2] (సహీహ్ తిర్మిజీ: 1899).

https://teluguislam.net



అబూ దర్దా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచిస్తుండగా తాను ఇలా విన్నాని తెలియజేశారు:

‘‘నిశ్చయంగా తల్లిదండ్రులు స్వర్గ ద్వారాలన్నిటిలో మధ్య ద్వారం లాంటివారు. నీ కిష్టమయితే ఆ ద్వారాన్ని నాశనం చేసుకో, లేదా కాపాడుకో.’’ [1]

హజ్రత్ ముఆవియా బిన్ జాహిమా (రజియల్లాహు అన్హు) కథనం, జాహిమా (రజియల్లాహు అన్హు) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, నేను జిహాద్ లో పాల్గొనాలని అనుకుంటున్నాను, దానికి మీ అభిప్రాయం తెలుపండి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అని అడిగితిని.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ‘మీ తల్లిగారు ఉన్నారా?’ అని అడిగారు.

దానికి నేను: ‘అవును’ అని అన్నాను.

అయితే నీవు: **‘నీ తల్లి దగ్గరే (సేవ చేసుకుంటూ) ఉండూ, నీ తల్లి కాళ్ళ దగ్గరే స్వర్గం ఉంది’** అని అన్నారు. [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: నేను స్వర్గంలోనికి పోయాను అక్కడ నేను (ఖుర్ఆన్) పఠిస్తుండగా విన్నాను. అతనెవరు? అని నేను అడిగితిని. దానికి (దైవదూతలు) వారు: ‘హారిసా బిన్ నౌమాన్’

---

[1] (సహీహ్ తిర్మిజీ:1900).

[2] (అల్ ముస్తద్రక్ అలస్ సహీహైన్ లిల్ హాకిమ్: 2502).

https://teluguislam.net



అని అన్నారు. ‘‘మంచిగా ప్రవర్తిస్తే ఇలాగే ఉంటుంది–మంచిగా ప్రవర్తిస్తే ఇలాగే ఉంటుంది’’ అని ప్రవక్త (స) అన్నారు. (ఆయన తన తల్లితో అందరికంటే ఉత్తమంగా ప్రవర్తించేవారు.) [1]

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా ఇలా విన్నాను అని తెలియజేశారు:

‘మీ (బనీ ఇస్రాయీల్) పూర్వీకుల్లోని ముగ్గురు వ్యక్తులు కలిసి ప్రయాణిస్తుండగా దారిలో (వర్షంకారణంగా) ఒక గుహలో శరణు తీసుకుందామని అందులోకి వెళ్ళారు. అంతలోనే కొండపై నుంచి ఒక (పెద్ద) బండరాయి దొర్లిపడింది. దాని కారణంగా గుహ ముఖద్వారం మూసుకుపోయింది.’

ఆ ముగ్గురు: ‘మనం గతంలో చేసుకున్న సత్కార్యాల ఆధారంగా అల్లాహ్‌ను వేడుకోవడం తప్ప బయటపడే మార్గం వేరొకటి లేదు’ అని తీర్మానం చేసుకున్నారు.

వారిలో ఒకడు ఇలా వేడుకున్నాడు: ‘ఓ అల్లాహ్! నా వద్ద చాలా వృధాప్యానికి చెందిన తల్లిదండ్రులుండేవారు. నేను నా తల్లిదండ్రుల కంటే ముందు నా భార్య బిడ్డలకు, నా నౌకర్లుకు సాయంత్రం పూట పాలు త్రాపించేవాణ్ణి కాను. ఒక రోజు నేను (పశువులకు) చెట్ల మేత కోసం చాలా దూరం వెళ్ళిపోయాను. నేను ఇంటికి తిరిగి వచ్చేసరికి వారిద్దరూ నిద్రపోయారు. వారికోసం నేను పాలు పితికి తీసుకు వచ్చాను. అప్పటికే వారిద్దరూ మంచి నిద్రలో ఉండడం గమనించి వారిని నిద్ర లేపడం అంత మంచిది కాదనుకున్నాను. అలాగే వారికంటే ముందు నా భార్యబిడ్డలకు లేక నా

---

[1] (సహీహ్ సునన్ నసాయిూ:3104, సిల్‌సిలతుస్ సహీహా: 913, హాకిమ్:4917).

https://teluguislam.net



నౌకర్లకు పాలు త్రాపించడం కూడా నాకిష్టం లేదు. చివరికి నా పిల్లలు నా కాళ్ళ మీదపడి విలవిల్లాడిన (నేను వారికి త్రాపకుండా) పాల ప్రాత్ర నా చేతిలో పట్టుకొని తెల్లవారేదాక వాళ్ళ దగ్గరే నిలబడి, (ఏ సమయంలోనైనా వారు మేల్కొంటారేమోనని) ఎదురు చూడసాగాను. చివరికి వారు నిద్రమేల్కొన్నారు. వారికోసం ఉంచిన పాలు వారు తాగారు.

**ఓ అల్లాహ్! కేవలం నీ ప్రసన్నత కోసమే నేనీ పని చేసివుంటే మేము చిక్కుకున్న ఈ గుహ ముఖద్వారం నుండి బండ రాయిని తొలగించి మమ్మల్ని రక్షించు.'** అంతలో ఆ బండ రాయి కొద్దిగా జరిగింది. అయినా ఆ సందుగుండా వారు బయటికి రాలేకపోయారు.

**తరువాత రెండోవ్యక్తి అభ్యర్థించుకోసాగాడు:** 'ఓ అల్లాహ్! నా బాబాయి కూతురు ఉండేది. నేనామెను అమితంగా అమితంగా ఇష్టపడేవాణ్ణి. (వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది): మగవారు ఆడవారిని అమితంగా ప్రేమించినంతగా నేను ఆమెను ప్రేమించేవాడిని. ఒకసారి నేను ఆమె పొందుకోసం పరితపించాను. అందుకామె ఒప్పుకోలేదు. ఆఖరికి దుర్భిక్షం ఆమెను గత్యంతరం లేక నా వద్దకు వచ్చేలా చేసింది. అప్పుడు ఆమె నాతో ఏకాంతంలో గడిపే షరతుపై నేనామెకు నూట ఇరవై దీనార్లు ఇచ్చాను. (గత్యంతరం లేక ఆమె అవి తీసుకుంది). నా కోరిక తీర్చేందుకు సిద్ధమయ్యింది. నేనామెను ఆక్రమించుకున్నప్పుడు, (వేరొక ఉల్లేఖనం ప్రకారం) నేను ఆమె రెండు తొడల మధ్య కూర్చున్నప్పుడు ఆమె నాతో: **''అల్లాహ్‌కు భయపడు! అక్రమంగా కన్నెపొరను చీల్చకు'** అని అంది.

ఆ మాటలు విన్న తడవుగా నేను ఆమె దగ్గరనుండి లేచి పోయాను. నిజానికి ఆమె నాకు ప్రజల్లో అత్యంత ప్రియమైనది. నేను ఆమెకిచ్చిన

https://teluguislam.net



బంగారు దీనార్లను కూడా వదులుకున్నాను. **'ఓ అల్లాహ్! నేను కేవలంనీ ప్రసన్నత కోసమే ఇలా చేసి ఉన్నట్లయితే మాపై వచ్చిపడిన ఈ విపత్తు నుండి మమ్మల్ని రక్షించు.' రెండొవ్యక్తి వేడుకోలు తరువాత ఆ బండరాయి ఇంకొంచెం తొలగింది.** అయినా గాని వారు బయట పడేందుకు మార్గం సుగమం కాలేదు.

**ఆ తరువత మూడోవ్యక్తి వేడుకోవడం ప్రారంభించాడు:** 'ప్రభూ! నేను కొంత మంది పని మనుషులను జీతానికి ఉంచుకున్నాను. నేను వారందరికీ జీతాలిచ్చేశాను. కాని వారిలో ఒకడు మాత్రం తన జీతం పుచ్చుకోకుండానే వెళ్ళిపోయాడు. నేను అతని జీతాన్ని వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాను. దాంతో చాలా ధనం పోగయ్యింది. కొంత కాలానికి ఆ వ్యక్తి వచ్చి,

**'ఓ అల్లాహ్ దాసుడా!** నాకు నా జీతం ఇవ్వు' అనడిగాడు. దానికి నేను, 'నువ్వు చూస్తున్నటువంటి ఈ ఒంటెలు, ఆవులు, మేకలు, బానిసలు–అన్నీ నీ జీతం ఫలాలే (వాటిని నువ్వ తీసుకో)' అన్నాను. అందుకతను:

**'ఓ అల్లాహ్ దాసుడా!** నాతో పరాచికాలు వద్దు' అంటూ చిన్నబోయాడు. నేను **'ఇది పరాచికం కాదు (నిజం చెబుతున్నాను' అన్నాను. అప్పుడు అతను (నా కోసం) ఏమీ వదల కుండా ఆ సంపదనంతా తరలించుకొని వెళ్ళిపోయాడు: ఓ అల్లాహ్! నేను ఈ పని కేవలం నీ ప్రసన్నతను దృష్టిలో పెట్టుకొనే చేసినట్లయితే మేము చిక్కుకున్నటువంటి ఈ ఆపద నుంచి మమ్మల్ని కాపాడు.'**

దాంతో ఆ బండరాయి పూర్తిగా తొలగిపోయి గుహద్వారం తెరుచుకోవటంతో వారు ముగ్గురూ బయటపడ్డారు.[1]

---

[1] (బుఖారీ:2111, ముస్లిం:4926, హదీసు కిరణాలు: 12).

https://teluguislam.net



## అల్లాహ్ మార్గంలో (షహీద్) అమరులైన వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు తమ ప్రభువు వద్ద (అల్లాహ్ దృష్టిలో) బ్రతికే ఉన్నారు, ఆహారం ప్రసాదించబడుతున్నది. అల్లాహ్ తన కృపతో ప్రసాదించిన దానిపట్ల వారు ఎంతో సంతోషంగా ఉన్నారు. తమ వెనుక (ప్రపంచంలో) ఉండిపోయి ఇంకా తమతో చేరని విశ్వాసులకు (పుణ్యాత్ములకు) కూడా ఏ విధమైన భయంకానీ, దుఃఖంకానీ కలిగే అవకాశం లేదని వారు నిశ్చింతగా ఉన్నారు. అల్లాహ్ బహుమానాలకు, ఆయన అనుగ్రహాలకు వారు (సంతోషంతో) వారు పొంగిపోతున్నారు. నిశ్చయంగా విశ్వాసుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధా చెయ్యడు.''[1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజియల్లాహు అన్హు) కథనం; మేము ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో: 'షహీదుల ఆత్మలు ఎక్కడ ఉంటాయని?' ప్రశ్నించగా, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

'వారి ఆత్మలు పచ్చని పక్షుల ఉదరాల్లోకి ప్రవేశపెట్ట బడతాయి. అల్లాహ్ అర్ష్ క్రింద పంజరములు ప్రేలాడుతూ ఉంటాయి, వాటిలో ఆ అత్మలు ఉంటాయి. అవి స్వర్గంలో ఎక్కడ కావాలంటే అక్కడ తిరుగుతూ ఉంటాయి. తరువాత ఆ పంజరములోకి తిరిగి వస్తాయి.'

---

[1] (3,ఆల ఇమ్రాన్: 169-171).

https://teluguislam.net



ఒక సారి అల్లాహ్ వారి ముందుకు వచ్చి: 'నా నుండి మీరు ఏమన్నా కోరుకోండి' అని అంటాడు.

అప్పుడు వారందరూ: 'ఏమని కోరుకోవాలి? మనం స్వర్గంలో తోచిన చోటెల్లా (అందలి అనుగ్రహాలను ఆస్వాదిస్తూ) విహరిస్తూ ఉన్నాము' అని అంటారు.

ఇలా మూడుసార్లు వారు ప్రశ్నంచబడతారు. చివరికి వారు అల్లాహ్ కోరికను స్వీకరించేవరకు ప్రశ్నించబడతూనే ఉంటారని గ్రహించి, అల్లాహ్‌ను ఇలా విన్నవించుకుంటారు:

'ఓ మా ప్రభూ! మళ్ళీ మా అత్మలను మా దేహాలలోకి పంపిస్తే మేము మళ్ళీ నీ మార్గంలో పోరాడి అమరగతి నొందాలన్నది మా కోరిక' అని అంటారు. (వారి జవాబును విన్న తరువాత) అల్లాహ్: 'వారికి ఎలాంటి అవసరం లేదని అడగడం వదిలేస్తాడు. [1]

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రెండు కారణాల వలన కండ్లకు అగ్ని కాల్చదు.

**ఒకటి;** అల్లాహ్‌తో భయపడి కన్నీరు కార్చినందుకు.

**రెండు;** అల్లాహ్ మార్గం (జిహాద్)లో రేయంతా కాపలా కాసినందుకు.''[2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ బాటలో

---

[1] (ముస్లిం:3500). ఎందుకంటే ఒక సారి మరణించిన తరువాత ప్రపంచంలో తిరిగివెళ్ళే అవకాశం ఎవరికీ ఇవ్వబడదు. అంటే ఏడేడు జన్మలు లేక మనిషి తిరిగి భూలోకానికి రావడం అసాధ్యం. అది అల్లాహ్ సృష్టించిన ప్రకృతికి విరుద్ధం.

[2] (తిర్మిజీ1563, ముస్నద్ అబీయాలా: 4346).

https://teluguislam.net



(జిహాద్‌లో) అంటుకున్న దుమ్ము మరియు నరకం యొక్క పొగ ఒక విశ్వాసి గల (ముస్లిం) దాసుని కడుపులో సమకూర్చబడవు.'' [1]

షహీద్‌గా మృత్యువు చెందిన వ్యక్తి అల్లాహ్ దగ్గర ఆరు విధాలుగా బహుమానం పొందుతాడు. హ్రజత్ మిఖ్‌దామ్ బిన్ మాదీకరీబ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: షహీద్‌కు అల్లాహ్ వద్ద ఆరు విశిష్ఠతలు ఉన్నాయి:

1) మొదటి రక్తపు చుక్క కారిన వెంటనే క్షమించబడుతాడు.
2) స్వర్గంలో అతని నివాసాన్ని అతనికి చూపబడుతుంది. మరియు సమాధి శిక్ష నుండి కాపాడబడుతాడు.
3) అతి పెద్ద (ప్రళయ) భయాందోళనకు గురికాకుండా శాంతి ప్రాప్తమవుతుంది.
4) విశ్వాసం మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు.
5) పెద్ద కళ్ళుగల హూర్ (అప్సరస)తో వివాహం జరుగుతుంది.
6) (ప్రళయం రోజు) 70 మంది చుట్టాలకు (స్వర్గానికై) సిఫారసు (అతని వైపున) అంగీకరించబడుతుంది. [2]

హ్రజత్ సహల్ బిన్ హునైఫ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సంకల్ప శుద్ధితో షహీద్‌గా మరణించాలని కోరుకున్న వ్యక్తికి అల్లాహ్ షహీదుల ఉన్నత స్థానాన్ని ప్రసాదిస్తాడు. ఒక వేళ అతనికి తన పడకపైనే మృత్యువు జరిగిఉన్నా సరే.'' [3]

---

[1] (సహీహ్ ఇబ్ను మాజా:2774).
[2] (తిర్మీజి, సహీహ్ ఇబ్నుమాజ: 2257).
[3] (ముస్లిం:3532).

https://teluguislam.net



హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ అనుచరులతో: 'మీలో షహీద్‌గా మృత్యువు చెందినారనే విషయాన్ని ఎలా తెలుసుకోగలరు' అని ప్రశ్నించారు.

అప్పుడు వారు: **'ఎవరైతే అల్లాహ్ మార్గంలో చంపబడ్డారో వారే షహీద్'** అని అనుచరులు అన్నారు.

అలాగైతే నా సమాజంలో షహీదుల సంఖ్య చాలా తక్కువే! అని ప్రవక్త అన్నారు.

అయితే, వారెవరో కాస్త తెలుపండి? అని ప్రజలు అడిగారు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స):

1) అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారు షహీద్.
2) అల్లాహ్ మార్గంలో **(ఫీ సబీలిల్లాహ్)** మృత్యువు పొందినవారు షహీద్.
3) అంటువ్యాధి **(మహమ్మారి)** వలన మృత్యువు పొందినవారు షహీద్.
4) కడుపు బాధ వలన మృత్యువు పొందినవారు షహీద్.
5) నీటిలో మునిగిమృత్యువు పొందినవారు షహీద్. అని తెలియజేశారు.[1]

హజ్రత్ జాబిర్ బిన్ ఉతైక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**అల్లాహ్ మార్గంలో చంపబడిన షహీద్ గాకుండా ఇంకా ఏడు రకాల షహీద్‌లు ఉన్నారు.**

1) మహమ్మారి కారణంగ చనిపోయినవారు షహీద్.
2) నీళ్ళలో మునిగి చనిపోయినవారు షహీద్.

---

[1] (ముస్లిం:3539).

https://teluguislam.net



3) నిమోనియా వ్యాధి వలన చనిపోయినవారు షహీద్.

4) కడుపు బాధ వలన చనిపోయినవారు షహీద్.

5) అగ్నిలో పడి కాలిపోయినవారు షహీద్.

6) దేని క్రిందనైనా పడిపోయి నలిగి చనిపోయిన వారు షహీద్.

7) గర్భస్రావం జరిగి ఆ బాధలోనే చనిపోయిన స్త్రీ షహీద్.[1]

హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"తమ ధనానికి బదులు చంపబడ్డ వ్యక్తి షహీద్, తమ కుటుంబీకుల (రక్షణ)కై చంపబడ్డ వ్యక్తి షహీద్, తమ ధర్మాన్ని (రక్షించుట)కై చనిపోయిన వ్యక్తి షహీద్, తన ప్రాణాన్ని (రక్షించుకొనుట) కై చంపబడ్డ వ్యక్తి షహీద్" [2]

పైన చెప్పబడిన వివిధ మరణాలు అనుకోకుండా జరిగే సంఘటల కారణంగా మృత్యువు ప్రాప్తమైతే **'షహీద్'** అనే పుణ్యమైన మృత్యువు అవుతుంది. ఒకవేళ కావాలనీ మరియు ఉద్దేశపూర్వకంగా తమ ప్రాణాలకు హాని కలిగించుకొనీ ఆత్మహత్యకు పాల్పడితే శాశ్వతమైన నరక శిక్ష తప్పదు. కనుక ఒక హదీసులో ఇలా ఉంది:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైతే ఉరి వేసుకొని చనిపోతాడో, అతను నరకంలో ఉరి వేసుకొనే శిక్షను అనుభవిస్తాడు. ఎవరైతే కత్తితో పొడుచుకొని చనిపోతాడో, అతను నరకంలో కత్తితో పొడుచుకొనే శిక్షను అనుభవిస్తాడు." [3]

---

[1] (సహీహ్ అబూదావూద్: 3111, సహీహ్ సునన్ నసాయీ:1846,సహీహ్ అల్ జామీ: 3739).

[2] (సహీహ్ తిర్మిజీ:1421, సహీహ్ సునన్ నసాయీ:4095).

[3] (బుఖారీ:1276).

https://teluguislam.net



## ఉపవాసాలు పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

ఉపవాసాన్ని అరబీ భాషలో **'సియామ్'** లేక **'సౌమ్'** అని అంటారు. అరబీ నెల 'రమజాన్'లో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలకు, భార్యతో సంభోగానికి దూరంగా ఉండటం అని అర్థం. ఈ వ్రతం కేవలం అల్లాహ్ ప్రసన్నత కొరకే పాటించాలి. ఇది ఆత్మ శుద్ధికి అత్యంత ముఖ్యమైన ఆరాధన గనుక మీకు పూర్వం గతించిన సమాజాలపై కూడా ఈ ఆరాధన విధిగా నిర్ణయించబడింది.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది – మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది. [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయినా రమజాన్ మాసంలో విశ్వాసంతో, పుణ్యఫలా పేక్షతో ఉపవాసం పాటిస్తే, గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి'' [2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ప్రతి మనిషి అతను చేసే సత్కార్యానికిగాను, పది నుండి ఏడువందల రెట్ల పుణ్యం ప్రసాదించబడుతుంది. అల్లాహ్ ఇలా తెలియజేశాడు: కాని ఉపవాసం (పుణ్యం) అలా కాదు. ఉపవాసం ప్రత్యేకంగా నా కోసం పాటించబడుతుంది. అందువల్ల నేను స్వయంగా

---

[1] (సూరతుల్ బఖరా: 183).

[2] (బుఖారీ:37, ముస్లిం:1268).

https://teluguislam.net



దానికి ప్రతిఫలం ప్రసాదిస్తాను. ఉపవాసికి రెండు సందర్భాల్లో అమిత ఆనందం లభిస్తుంది. ఒకటి; ఉపవాసాన్ని విరమించేటప్పుడు. రెండవది; తన ప్రభువును కలుసుకున్నప్పుడు. నిశ్చయంగా అతని నోటి నుండి వెలువడే వాసన అల్లాహ్ దృష్టిలో కస్తూరి వాసన కన్నా మేలైనది.'' [1]

హ్రజత్ సహల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''స్వర్గంలో ఒక ద్వారం ఉంది. దాన్ని **'రయ్యాన్'** అని పిలుస్తారు. ప్రళయ దినాన దానిగుండా ఉపవాసులు స్వర్గప్రవేశం చేస్తారు. వారు తప్ప ఇతరులెవరూ దాని గుండా ప్రవేశించలేరు.
ఆ రోజున 'ఉపవాసులేరి?' అని ఆరాతీయటం జరుగుతుంది. ఆ మాట వినగానే ఉపవాసులందరూ (స్వర్గప్రవేశానికి) బయలు దేరుతారు. వారు లోనికి ప్రవేశించగానే, ఇతరులెవరూ లోనికి రాకుండా, ఆ ద్వారం మూయబడుతుంది.''[2]

హ్రజత్ సహల్ బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఉపవాసుల కొరకు ఒక ద్వారం ఉంది. దాన్ని **'రయ్యాన్'** అని పిలుస్తారు. దానిగుండా ఉపవాసులు తప్ప ఇతరులెవరో స్వర్గంలో ప్రవేశించలేరు. వారిలో చివరి వ్యక్తి ప్రవేశించగానే ఆ ద్వారం మూయబడుతుంది. దానిలో ప్రవేశించిన వాడు (పవిత్రమైన పానీయం) త్రాగుతాడు, మరియు ఆ నీటిని త్రాగినచో ఇక ఎన్నటికీ దాహం కలగదు.'' [3]

---

[1] (ముస్లిం:1945).
[2] (బుఖారీ:1763, ముస్లిం:1947).
[3] (సహీహ్ నసాయి: 2236, సహీహ్ ఇబ్ను ఖుజైమా:1796).

https://teluguislam.net



## జకాత్ విధిగా చెల్లించేవారిపై అల్లాహ్ కారుణ్యం ఉంటుంది:

నమాజు మరియు ఉపవాసం, హజ్జ్ వంటి ఆరాధనలు **'హుఖూఖుల్లాహ్'** (అల్లాహ్ హక్కుల) జాబితాలోకి రాగా, జకాత్ **'హుఖూఖుల్ ఇబాద్'** (దాసుల హక్కుల) జాబితాలోకి వస్తుంది. కనుక మనిషి అల్లాహ్ వద్ద ప్రేమింపబడాలంటే అల్లాహ్ కోసం చేయవలసిన ఆరాధనలు పాటిస్తూ, దాసుల హక్కులు నెరవేర్చితే అల్లాహ్ ప్రేమ మరియు కారుణ్యం పొందగలరు. కనుక జకాత్‌ను విధిగా చెల్లించడానికి అర్హులైనవారు జకాత్ చెల్లిస్తే అల్లాహ్ వారిపై తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. మరియు స్వర్గాన్ని కూడా ప్రసాదిస్తాడని ఖుర్ఆన్‌లో అనేక చోట్ల తెలియజేశాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు మీరు నమాజులను నెలకోల్పుతారు, జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. అల్లాహ్ అతి త్వరలోనే తన కారుణ్యాన్ని కురిపించేది వీరిపైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాశీలి.''[1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: మరియు మీరు నమాజ్‌ను నెలకొలప్పండి, జకాత్‌ను ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు మంచి రుణం ఇవ్వండి. మీరు మీ కోసం ఏ మంచిని (పుణ్యకార్యాన్ని) ముందుగా పంపినా, దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు. క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలి, దయాశీలి.'' [2]

---

[1] (సూరతు తౌబా:71).

[2] (సూరతుల్ ముజ్జమ్మిల్:20).

https://teluguislam.net



హ(జ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ఒక పల్లెవాసి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చి,

**'యా రసూలల్లాహ్!** నన్ను స్వర్గానికి గొనిపోగల సత్కర్మ ఏమిటో తెలుపండి' అని అడిగాడు.

**అందుకాయన:** ''ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. ఆయనకు సహ వర్తులుగా మరెవరినీ నిలబెట్టకు. నమాజును స్థాపించు. జకాత్‌ను విధిగా చెల్లించు. రమజాన్ నెల ఉపవాసాలు పాటించు'' అని ఉపదేశించారు.

**(అంతా విన్న తరువాత ఆ పల్లెవాసి):** ''ఎవరిచేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. నేనిందులో (అధనంగా) ఏ విషయాన్ని చేర్చను'' అంటూ తిరిగి వెళ్ళి పోయాడు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): అతని వైపు చూపిస్తూ **'మీలో స్వర్గవాసిని చూడగోరేవారు ఈ వ్యక్తిని చూడవచ్చు'** అని అన్నారు. [1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ప్రజల సొమ్ములలో చేరి వృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో ఎంతమాత్రం వృద్ధి చెందదు. అయితే అల్లాహ్ ముఖాన్ని చూచేందుకు (ప్రసన్నతను చూరగొనేందుకు) మీరు జకాతు దానం ఇచ్చినట్లయితే ఎన్నోరెట్లు వృద్ధిపరుచుకున్న వారవుతారు.'' [2]

---

[1] (బుఖారీ:1310, ముస్లిం:16).

[2] (సూరతుర్ రూమ్: 39).

https://teluguislam.net



మరొక చోట ఇలా తెలియజేశాడు: ‘‘కనుక మీరు నమాజును నెలకొల్పండి, జకాతును చెల్లించండి, అల్లాహ్‌ను స్థిరంగా ఆశ్రయించండి. ఆయనే మీ సంరక్షకుడు! (ఆయన) ఎంత చక్కని సంరక్షకుడు! మరెంత చక్కని సహాయకుడు!’’ [1]

హజ్రత్ అబూ అయ్యూబుల్ అన్సారీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ‘‘ఎవరయితే అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించి, ఆయనతో ఇతరులెవరినీ సాటి కల్పించకుండా, నమాజ్‌ను నెలకోల్పి, జకాత్‌ను చెల్లించి మరియు పెద్ద పాపాల నుండి దూరమ్మై (ప్రళయ దినాన అల్లాహ్ వద్దకు) వస్తాడో, అతనికి స్వర్గం ప్రసాదించబడుతుంది.’’[2]

## హజ్ చేసినవారి సర్వ పాపాలు క్షమించబడతాయి:

హజ్ యాత్ర స్థోమత కలిగి ఉన్న ప్రతి ముస్లిం హజ్ చేయడం విధి. అంటే: అతని వద్ద ప్రయాణ ఖర్చులు, అవసరమ్మైన వస్తు సామగ్రి ఉండాలి. మరియు హజ్ యాత్రకై పరిస్థితులు సానుకూలంగా ఉండాలి. వెళ్ళే దారిలో శాంతియుత నెలకొని ఉండాలి. ధనమాన, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం పొంచి ఉండకూడదు.

ప్రయాణం చేయగలిగేందుకు ఆరోగ్యవంతంగా ఉండాలి. స్త్రీలు యాత్రకు బయలుదేరితే వారివెంట మహ్రమ్ బంధువులు తప్పక ఉండాలి. శక్తీ స్థోమతలు ఉండి కూడా హజ్ చేయడానికి నిరాకరిస్తే అది కుఫ్ర్

---

1 (సూరతుల్ హజ్:78).

2 (సహీహ్ సునన్ నసాయీ:4009, అహ్మద్:22403).

https://teluguislam.net



(తిరస్కారవైఖరి) అవుతుందని ఖుర్‌ఆన్ మరియు హదీసు గ్రంథాలలో తీవ్రంగా హెచ్చరించడం జరిగింది.

కనుక అల్లాహ్ ఇలా ఆదేశించారు: 'అక్కడికి వెళ్ళే స్థోమతగల వారికి, ఆ గృహ(యాత్ర) హజ్ చేయటాన్ని అల్లాహ్ విధిగా చేశాడు. మరెవరయినా (ఈ ఆజ్ఞను శిరసావహించటానికి) నిరాకరిస్తే అల్లాహ్‌కు సమస్త లోకవాసుల అవసరం ఎంతమాత్రం లేదు.' [1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను 'ఆచరణలన్నిటిలో కెల్లా శ్రేష్ఠమైనది ఏది?' అని అడిగారు.

అందుకాయన ఇలా తెలియజేశారు: **'అల్లాహ్‌ను, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించటం'** అని అన్నారు.

ఆ తర్వాత ఏది? అని అడిగారు: **'దానికి ఆయన అల్లాహ్ మార్గంలో పోరాటం'** అని చెప్పారు.

ఆ తర్వాత ఏది? అని అడిగితే : **'హజ్జే మబ్రూర్'** అని చెప్పారు. [2]

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) గారు ఇలా తెలియజేశారు: ''ఎవరయితే ఎలాంటి అపసవ్యమైన చేష్టలకు, వ్యర్థ విషయాలకు పాల్పడకుండా, అల్లాహ్ అవిధేయతకు ఒడిగట్టకుండా జాగ్రత్తపడుతూ హజ్ చేస్తారో, వారు ఆ రోజే తల్లి గర్భం నుంచి పుట్టిన వారిలా (పరమ పవిత్రులై) తిరిగి వస్తారు.'' [3]

---

[1] (సూరతుల్ ఇమ్రాన్:97).

[2] (బుఖారీ:25, ముస్లిం:118).

[3] (బుఖారీ:1424, ముస్లిం:2404).

https://teluguislam.net



హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా చేయటం వాటి మధ్య జరిగిన పాపాలన్నిటికీ పరిహారం అవుతుంది. మబ్రూర్ (ఆమోదించబడిన)హజ్‌కు ప్రతి ఫలం స్వర్గం తప్ప మరేమీ లేదు.''[1]

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం; ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో కలిసి హజ్ చేస్తుండగా ఆ వ్యక్తిని ఒంటె తన కాళ్ళ క్రింద త్రొక్కి చంపేసింది. అతను ముహ్రిం (హజ్ దీక్ష బూనియున్న వక్తి) స్థితిలో ఉన్నాడు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఆదేశించారు: ''నీళ్ళలో రేగు ఆకులు వేసి అతన్ని స్నానం చేయించండి. అవే దుస్తులలో ఖననం చేయండి. సుగంధాలు పూయకండి. అతని తలను కప్పకండి. ఎందుకంటే అతను ప్రళయ దినాన తన సమాధి నుండి 'తల్బియా' పలుకుతూ లేస్తాడు.'' [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) కథనం; నేనొకసారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని:

**యా రసూలల్లాహ్!** '' మేము అల్లాహ్ మార్గంలో పోరాటాన్ని శ్రేష్ఠమైన ఆచారణగా భావిస్తాం. అందుకని మాకు అల్లాహ్ మార్గంలో పోరాడాలని ఉంది'' అని అన్నాను.

---

[1] (బుఖారీ:1650, ముస్లిం:2403).

[2] (బుఖారీ:1186, ముస్లిం:2092). **'తల్బియా'** లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక లా షరీక లక లబ్బైక్, ఇన్నల్ హమ్ద వన్నిమత లక వల్ ముల్కలాషరీక లక్.

https://teluguislam.net



అందుకాయన, ‘‘ఉండవచ్చు, కాని (మీ కొరకు) శ్రేష్ఠమైన పోరాటం **‘హజ్జె మబ్రూర్’** చేయటానికి ప్రయత్నించటం’’ అని చెప్పారు.[1]

ఆరాధనలన్నిటిలో విధులకు (ఫర్జ్‌లకు) ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. అల్లాహ్ మనపై విధించిన ఆరాధలను పాటిస్తూ, అల్లాహ్ సామీప్యాన్ని పొందే మార్గం ఇతర మార్గాలన్నిటికన్నా అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవి. ఎందుకంటే ఫర్జ్ (విధి)ఆరాధనలు ధర్మానికి పునాదుల్లాంటివి. పునాది గట్టిగా లేకపోతే కట్టడం కూడా బలహీనంగానే ఉంటుంది. అదే విధంగా విధుల్ని నిర్వర్తించకుండా కేవలం నఫిల్ ఆరాధనలు చేస్తే దానివల్ల ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు.

ఫర్జ్ ఆరాధనలను నిర్వర్తించని వాడు అసలు ముస్లిం అని చెప్పటానికి అనర్హుడు. ఫర్జ్ ఆరాధనల్ని వదిలిపెట్టే వారికి ఖుర్‌ఆన్, హదీసుల్లో ఎన్నో హెచ్చరికలు చేయబడ్డాయి. కాని నఫిల్ ఆరాధనల్ని వదిలిపెట్టినవారిని తప్పు పట్టడం జరగదు. అయితే ఫర్జ్‌లతో పాటు నఫిల్ కార్యాలు కూడా పాటిస్తే దాని ప్రయోజనం మరింత ఎక్కువవుతుంది. అల్లాహ్ సన్నిధిలో గౌరవ ప్రదమైన స్థానం లభిస్తుంది, అలాంటి వారిని అల్లాహ్ అనేక విధాలుగా గౌరవ సన్మానాలతో అనుగ్రహిస్తాడు. అందువలన ఇప్పుడు మేము మీ కొరకు నఫిల్ ఆరాధనల ప్రత్యేకత మరియు దాని ఘనత గురించి తెలియజేస్తాము.

---

[1] (బుఖారీ: 1423).